క్లుప్తంగా

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కడియం



స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టు పనుల గురించి మంత్రితో కడియం చర్చించారు. నియోజవకర్గంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందించేలా దేవాదుల ప్రాజెక్టులో పెండింగ్ పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ పనులపై ప్రత్యేక చొరవ తీసుకుని సత్వర చర్యలు తీసుకోవాలని మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ దేవాదుల పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే కడియంను కలిసిన జయపాల్‌రెడ్డి



స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బేతి జయపాల్‌రెడ్డి బుధవారం హనుమకొండలో స్థానిక ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కడియంకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించాలని ఆయన కోరారు.

అన్నదానం



జనగామ రూరల్: పట్టణంలోని చిన్నం మహేష్, వరలక్ష్మి దంపతుల కుమారుడు సాయిచంద్ పుట్టిన రోజు పురస్కరించుకుని బుధవారం రాజరాజేశ్వరి అనాథ ఆశ్రమంలో పవన్ కళ్యాణ్ హెల్పింగ్ పీపుల్స్, స్నేహితుల ఆధ్వర్యంలో అన్నదానం, పండ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కర్రె వీరస్వామి, పులిగిల్ల రాజేష్ యాదవ్, జోగు భాస్కర్, సాయిరెడ్డి, ఉమేష్, జోగు ఉదయ్, శంకర్, గుజ్జుల నాలిన్, రోహిత్, కూకట్ల శశి, మను, బాలు, కర్రె ఉదయ్, ఆలకుంట్ల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా దక్కని ఉద్యోగం



పాలకుర్తి టౌన్: నాడు తెలంగాణ ఉద్యమంలో పాదయాత్ర చేసి ఉద్యోగం కోల్పోయిన ఉద్యమకారుడు ఉద్యోగం కోసం మరోసారి శాంతియుతంగా పాదయాత్ర చేపట్టి బుధవారం పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి చేరుకున్నాడు. కరీంనగర్ జిల్లా కోనారావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన వనపర్తి విద్యాసాగర్ మెట్‌పల్లి ఆర్టీసీ బస్ డిపోలో పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నందుకు విధుల నుంచి తొలగించారని తెలిపారు. తన జీవనాధారం ఉద్యోగం కోసం పరకాల మండలం మల్లక్కపేట భక్తాంజనేయ స్వామి ఆలయం నుంచి శాంతియుతంగా మౌనదీక్ష ప్రారంభించి పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. నాడు తెలంగాణ ఉద్యమంలో పాదయాత్ర చేసి కోల్పోయిన ఉద్యోగాన్ని వెంటనే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు.

క్రీడా ప్రాంగణాలు నిరుపయోగం

- గ్రామాల్లో అందుబాటులోకి రాని పరిస్థితి
- పలుచోట్ల బోర్డులకే పరిమితం
- వసతుల కల్పనలో నిర్లక్ష్యం
- నిరాశలో గ్రామీణ క్రీడాకారులు



చిల్పూరులోని క్రీడా ప్రాంగణం



శ్రీపతిపల్లిలో పీఏసీఎస్ స్థలంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు

చిల్పూరు: బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు ప్రస్తుతం బోర్డులకే పరిమితమయ్యాయి. క్రీడాకారులకు గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతో జిల్లా, మండలాల వ్యాప్తంగా సీఎం కప్ నిర్వహణతో కొన్ని రోజుల పాటు పండుగ వాతావరణం నెలకొల్పారు. అనంతరం అప్పటికప్పుడు అన్ని గ్రామాల్లో క్రీడల కోసం అనువైన స్థలాలను కేటాయించి క్రీడా పరికరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఎంపీడీఓ, ఎంపీఓ, ఉపాధిహామీ ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు యుద్ధప్రాతిపదికన కృషిచేసి క్రీడా మైదానాలను ఏర్పాటు చేయడంతో పాటు బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామాల్లో క్రీడలపై ఆసక్తి ఉన్నవారిలో కొత్త ఆలోచనలు చిగురించాయి. అయితే అవి మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలిపోయాయి. మండల వ్యాప్తంగా ఏ ఒక్క గ్రామంలోనూ పూర్తి స్థాయిలో వసతులతో మైదానాలు అందుబాటులోకి రాలేదు.

రూ. 4 లక్షలతో ఏర్పాట్లు..

ఉపాధిహామీ పథకం నుంచి క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు రూ. 4 లక్షల వరకు వినియోగించుకునేందుకు గత ప్రభుత్వం అవకాశం కల్పించింది. అట్టి నిధులతో క్రీడా పరికరాల ఏర్పాటు, మైదానం చదును, బాస్కెట్‌బాల్, ఖో–ఖో, కబడ్డీ, లాంగ్, హైజంప్, క్రికెట్ వంటి క్రీడలకు సంబంధించిన కోర్టులు ఏర్పాటు చేయాలి. కొన్ని చోట్ల స్థలాల కొరత ఉండగా శ్రీపతిపల్లి గ్రామంలో పీఏసీఎస్‌కు చెందిన స్థలంలో క్రీడా ప్రాంగణం బోర్డు ఏర్పాటు చేయగా కొన్ని గ్రామాల్లో చెట్ల పొదలు, గుట్టల ప్రాంతంలో ఏర్పాటు చేశారు.

యువత క్రీడలకు దూరం..

గ్రామీణ ప్రాంతాల్లో ఆట స్థలాలు లేకపోవడంతో యువత క్రీడలకు దూరమవుతున్నారు. గ్రామానికో ప్రాంగణం ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా పూర్తి స్థాయిలో పట్టించుకోకపోవడంతో అవి వృథాగా ఉన్నాయి. క్రీడాకారుల కోసం కేవలం వాలీబాల్, క్రికెట్ కిట్‌లు రాగా కొన్ని చోట్ల మాత్రమే పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా ప్రాంగణాల్లో పరికరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

తూతూ మంత్రంగా..



గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడామైదానాలు ఉన్నతాధికారుల ఆదేశాలతో మండల అధికారులు తూతూ మంత్రంగా ఏర్పాటు చేసి ప్రజాధనం దుర్వినియోగం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

- పాలబోయిన జోగులు, శ్రీపతిపల్లి

సదుపాయాలు ఏర్పాటు చేయాలి



క్రీడాకారులను ఆటల్లో ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో మౌలిక సదుపాయాలు, క్రీడా పరికరాలను ఏర్పాటు చేయాలి. యువత ఈవెంట్స్ కోసం సాధన చేద్దామంటే సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

- శరత్, చిల్పూరు

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు..



మండలంలోని అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఉన్నాయి. అందులో పరికరాలు లేవు. గత ప్రభుత్వంలో క్రీడాకారుల కోసం వాలీబాల్, క్రికెట్ కిట్‌లు రాగా అప్పుడు గ్రామాల్లో అందజేశారు. ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. వస్తే సౌకర్యాలు కల్పిస్తాం.

- బర్మావత్ శంకర్‌నాయక్, ఎంపీడీఓ, చిల్పూరు

అధికారులు పర్యవేక్షించాలి

జనగామ: పట్టణంలోని గిర్నిగడ్డ శ్మశాన వాటికలో అనాథ మృతదేహాలను ఖననం చేసే సమయంలో అధికారుల పర్యవేక్షణ అవసరమని వార్డుకు చెందిన ప్రజలు ఇల్లందుల ఆశాజ్యోతి, ఎండి సలీం, ఉడుగుల కర్ణాకర్, కానుగంటి వినోద్, ఆరూరి భాస్కర్ అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ గిరిగడ్డ శ్మశాన వాటికలో ఆరు వార్డులకు సంబంధించి అంత్యక్రియలు జరుగుతాయన్నారు. అనాథలు మృతిచెందిన సమయంలో మున్సిపల్ ట్రాక్టర్లలో తీసుకు వచ్చి, ఆనవాళ్లు లేకుండా సమాధి చేస్తున్నారన్నారు. అనాథ మృతదేహాలు పెరుగుతున్న సమయంలో, భవిష్యత్‌లో ఇక్కడ సమాధులను నిర్మించుకునే అవకాశం లేకుండా పోతుందన్నారు. అనాథ మృతదేహాలను ఎక్కడెక్కడ పూడ్చిపెట్టారనే క్లారిటీ లేకపోవడంతో, స్థానికులు మృతి చెందితే, గుంతలు తీసే సమయంలో నాడు పాతిపెట్టిన మృతదేహాలు బయట పడుతున్నాయన్నారు. ఈ సమస్య పునరావృతం కాకుండా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

హాలులో పేషెంట్లు.. కిటికీలకు సెలైన్ బాటిళ్లు



హాలులో బెడ్లపై రోగులు, (ఇన్‌సెట్‌లో) కిటికీకి సపోర్టుగా సెలైన్ బాటిల్

జనగామ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ఓపీ, అడ్మిట్ పేషెంట్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి, రెండో అంతస్తు జనరల్ వార్డుల్లో బెడ్లు వందశాతం నిండి పోగా, అంతకు మించి వచ్చే రోగులను వార్డు బయట బెడ్లు వేసి పడుకోబెడుతున్నారు. సెలైన్ బాటిల్స్ ఎక్కించే స్టాండుల కొరత ఉండటంతో వాటిని కిటికీలకు సపోర్టుగా వేలాడదీస్తూ సేవలందిస్తున్నారు.

-జనగామ

1.17 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు



నెల్లుట్లలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సివిల్ సప్లయ్ కమిషనర్ డీఎస్ చౌహాన్, కలెక్టర్ రిజ్వాన్‌భాషా (ఫైల్)

లింగాలఘణపురం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో 11 ఐకేపీ, 5 పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 1,17,185 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. అందులో చీటూరు, జీడికల్, కొత్తపల్లి, నాగారం, నవాబుపేట, నేలపోగుల, నెల్లుట్ల, పటేల్‌గూడెం, సిరిపురం, వనపర్తి, వడిచర్ల ఐకేపీ కేంద్రాల్లో 79,290.40 క్వింటాళ్లు, క్లోం పీఏసీఎస్ పరిధిలోని కళ్లెం, మాణిక్యాపురం, గుమ్మడవెల్లిలో 19,698.80 క్వింటాళ్లు, లింగాలఘణపురం పీఏసీఎస్ పరిధిలోని కుందారం, లింగాలఘణపురంలో 18,196 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేపట్టారు. అందులో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. నెల్లుట్ల ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ సందర్శించి రైతులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా వారం రోజుల్లో డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో రైతులకు ఈసారి ఎలాంటి ఇబ్బంది కలుగలేదు.

భవన నిర్మాణ కార్మికులు ఐక్యం కావాలి

జఫర్‌గఢ్: సమస్యల పరిష్కారానికి భవన నిర్మాణ కార్మికులు మరింత ఐక్యం కావాలని ఆ సంఘం జిల్లా నాయకులు నాయిని రామస్వామి, పిన్నింటి నర్సింహరాములు, తాటికాయల ఎల్లయ్య కోరారు. మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. అనేక సమస్యలతో భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికుల సమస్యలను గత ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. మండల కేంద్రంలో జూన్ 1వ తేదీన భవన నిర్మాణ కార్మికుల నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం వారు కోరారు. సంఘం మండల అధ్యక్షుడు గాదె ఆశోక్, టౌన్ అధ్యక్షుడు తాటికాయల శోభన్‌బాబు, సంఘం నాయకులు సముద్రాల ఎల్లయ్య, బల్లెపు భిక్షపతి, తాటికాయల రవి, మంచాల అనిల్, మల్లేష్ పాల్గొన్నారు.

‘విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటం’



నినాదాలు చేస్తున్న టీపీటీఎఫ్ సభ్యులు

జనగామ: విద్యారంగ సమస్యల పరిష్కారానికి టీపీటీఎఫ్ సమరశీల పోరాటం చేస్తుందని, ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నర్సింహారెడ్డి అన్నారు. టీపీటీఎఫ్ ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయం ఉమాపతి భవన్ ప్రాంగణంలో బుధవారం దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యమాలు బలహీనపడ్డాయని, పాలక వర్గాలు ప్రజా ఉద్యమాలపై, ఉద్యమకారులపై ఉక్కుపాదం మోపుతున్నాయన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టువంటిదన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాస్ మాట్లాడుతూ నాణ్యమైన విద్య ద్వారానే సామాజిక అభివృద్ధి సాధ్యమన్నారు. పదేళ్లుగా తెలంగాణలో ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, బడ్జెట్ కేటాయింపులు క్రమంగా తగ్గించిందన్నారు. బదిలీ, కొత్త నియామకాల ప్రక్రియ కొనసాగించి పాఠశాల విద్యారంగాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎస్ రాజు, వజ్రయ్య, వెంకన్న, సత్యనారాయణరెడ్డి, అంకుషావలి, రాజేందర్, రాజారెడ్డి, వరప్రసాద్, వసంత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు



పల్లె గౌతమి | పి. శ్రావ్య | నక్క రోహిత్



గాదె శ్రీజ | కాసర్ల రితిక | ఎం. శ్రీవర్షిత

జఫర్‌గఢ్: ఇటీవల నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో జఫర్‌గఢ్ మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటి ఎంపికయ్యారు. ఇందులో కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పసునూరి శ్రావ్య, పల్లె గౌతిమి ఎంపిక కాగా తమ్మడపల్లి (జి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన గాదె శ్రీజ, నక్క రోహిత్, మోడల్ స్కూల్ నుంచి మామిడాల శ్రీవర్షిత, కాసర్ల రితిక ఎంపికయ్యారని మండల నోడల్ అధికారి ఎండి పర్వేజ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు స్కాలర్‌షిప్ పొందనున్నట్లు పేర్కొన్నారు. కాగా, పాఠశాలల నుంచి అరుగురు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు అభినందించారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సుధీర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండలో 6వ వార్డుకు చెందిన మారపాక రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. రాజయ్య మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు తనవంతుగా రూ.5వేల సాయం అందజేశారు. మాజీ ఉపసర్పంచ్ మారపాక రాములు, నాయకులు ఎల్లస్వామి, శ్రీనివాస్, ప్రభుదాస్, ప్రభాకర్, శ్రీధర్, వసంత్, యాకయ్య పాల్గొన్నారు.

కమ్యూనిస్టులతోనే ప్రజాసమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

స్టేషన్‌ఘన్‌పూర్: మొదటి నుంచి సీపీఎం లక్ష్యం ప్రజల పక్షమని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాటాలు చేసేది కమ్యూనిస్టులేనని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేశ్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో బుధవారం జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలతో సమాజం మొత్తం కార్పొరేట్ చేతుల్లోకి వెళ్తుందని, తద్వారా ధనికులు మరింత ధనికులుగా, పేదలు మరింత పేదలుగా మారుతారన్నారు. సమాజంలో ఉన్న దోపిడీని అరికట్టాలంటే కమ్యూనిస్టులు బలపడాలని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసే కమ్యూనిస్టులను అన్ని వర్గాల ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు. సీపీఎం సభ్యుల చైతన్యం కోసం, ప్రజా సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ నిమిత్తం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 31 నుంచి జూన్ 1వరకు ఘన్‌పూర్ పట్టణ కేంద్రంలో జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణా తరగతులకు సీపీఎం శ్రేణులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొడెపాక యాకయ్య, గట్ల మల్లారెడ్డి, వంగపండ్ల సోమయ్య, పిట్టల నాగేష్, తొడెంగల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

రఘునాథపల్లి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అమ్మ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో కొనసాగుతున్న ప్రహరీ, ఇతర మరమ్మతు పనులు పరిశీలించి పనుల్లో నాణ్యత ఉండాలని పేర్కొన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు సత్వరం పూర్తయ్యేలా అమ్మ ఆదర్శ కమిటీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి కవిత, అంగన్‌వాడీ టీచర్ తాళ్లపల్లి అరుణ ఉన్నారు.

శాశ్వత ప్రాతిపదికన పనులు కల్పించాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

దేవరుప్పుల: జాతీయ ఉపాధి హామీ ద్వారా శాశ్వత ప్రాతిపదికన పనులకు ప్రాధాన్యం కల్పించాలని డీఆర్‌డీఓ సహాయ అధికారి చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ పథకం 15వ ఆర్థిక సామాజిక ఆడిట్ తనిఖీ మండల స్థాయి ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల ప్రణాళికల్లోనే తొలుత వ్యవసాయ సాగుకు అత్యంత ప్రయోజనం కలిగించే పనులను ఎంపిక చేయాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 32 గ్రామాల్లో 2023–24 సంవత్సరంలో చేపట్టిన రూ.6.22 కోట్ల పనుల తాలుకా రికార్డులను పరిశీలించారు. నిబంధనలను ఉల్లంఘించే సిబ్బందికి జరినామా తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, అంబాడజర్ గాదెపాక రాజు, విజిలెన్స్ అధికారులు నాగేశ్వర్‌రావు, సంధ్య, ఎస్ఆర్‌పీ గంగరాజు, ఈజీఎస్ ఏపీఓ కమ్మగాని శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



రికార్డును పరిశీలిస్తున్న కార్యదర్శి రాజశేఖర్

బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం అంగన్ వాడీ కేంద్రాల సందర్శనలో బాగంగా రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని అంగన్‌వాడీ టీచర్లు నెరవేర్చాలని, కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం మరింత పెంచాలన్నారు. ప్రతి కేంద్రంలో పౌష్టికాహారం సకాలంలో అందేలా చూడాలని, పూర్తి సమాచారం అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఇసుక అనుమతులు రద్దు చేయాలి

దేవరుప్పుల: గోదావరి ఇసుకతో రిజర్వాయర్లు నిర్మించాల్సిన నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడి వాగుపరివాహక రైతుల వ్యవసాయరంగానికి విఘాతం కలిగించే ఇసుక అనుమతులను సత్వరమే రద్దు చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు అల్లం ప్రదీప్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక అవసరాలైన పేదలు ఇళ్ల నిర్మించుకుంటే ఇసుక రవాణాకు అడ్డంకులు కల్పించొద్దన్న కొత్త నిబంధనలు ఆసరా చేసుకొని ఉన్నతాధికారులు కాంట్రాక్టర్లకు దోచిపెట్టేలా ఇలాంటి ఇసుక తవ్వకాల అనుమతులు ఇవ్వడం తగదన్నారు. ఎంపీ ఎన్నికల్లో ఇక్కడి ఇసుక తరలించాల్సిన అవసరం తమకు లేదన్న స్థానిక ఎమ్మెల్యే ఇప్పుడు రైతులకు నష్టం వాటిల్లే ఇలాంటి ఇసుక అనుమతులను ఎందుకు నిలువరించడంలేదని విమర్శించారు. ఈ విషయంలో వామపక్షపార్టీలు మౌనంగా ఉండడం విచారకరమన్నారు. ఎంపీ, ఎమ్మెల్సీ ఎలక్షన్లు అయిపోయే వరకు గుట్టుచప్పుడు కాకుండా పని చేసుకుని ఎలక్షన్లు అయిపోగానే జేసీబీలు, హిటాచీలతో దేవరుప్పుల, గొల్లపల్లి వాగులో నుంచి ఇసుక తరలించడం రైతులను దగా చేయడం కాదా అని ప్రశ్నించారు. ఇసుక తరలించే అనుమతులు రద్దు చేయకుంటే రైతు ఉద్యమాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

అర్చకుడికి సన్మానం

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన రుద్రేశ్వర శివాలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న గాడిపల్లి రమేశ్‌ను బుధవారం ఆలయ నిర్మాణ దాతలు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రమేశ్ అర్చకుడిగా కేవలం పూజలు చేయడమే కాకుండా ఆలయానికి వచ్చే భక్తులకు సాయంత్రం రామాయణం, భగవద్గీత అర్థమయ్యేలా వివరిస్తూ భక్తి భావం పెంపొందిస్తున్నాడని తెలిపారు. రాజగోవిందు, ఎడవెల్లి మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అభినందన

బచ్చన్నపేట: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జాతీయ స్థాయి పాన్ ఇండియా మాస్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ కప్ మాస్టర్స్ గేమ్స్‌లో మండలంలోని కట్కూర్ గ్రామ ఉన్నత పాఠశాలకు చెందిన హిందీ భాషా పండితుడు ఎం.సూర్యనారాయణ ద్వితీయ బహుమతి గెలుపొందారు. కాగా, బుధవారం తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆయనను అభినదించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం భాస్కరుని పృథ్వీరాజ్ మాట్లాడుతూ 50 ఏళ్ల వయస్సులో మొదటి ప్రయత్నంలోనే సూర్యనారాయణ ద్వితీయ బహుమతి పొందడం అభినందనీయమన్నారు. ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, మాజీ సర్పంచ్ సునీత, ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆలయంలో ప్రత్యేక పూజలు

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిదిలో బుధవారం ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, చిల్పూరు ఆలయ శాశ్వత అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఉత్సవ కమిటీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డిల ఆధ్వర్యంలో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొండగట్టుకు బయలుదేరిన మాలధారులు

చిల్పూరు: మండలంలోని దేశాయితండాకు చెందిన హనుమాన్ మాలధారులు బుధవారం ఇరుముడితో పాదయాత్రగా కొండగట్టుకు బయలు దేరారు. ఉదయం ప్రత్యేక పూజలు చేసి గురుస్వామి భూక్య రవి, వెంకటేశ్వర్లు, బిచ్చ, సుందర్, స్వామిల ఆధ్వర్యంలో ఇరుముడులతో కొండగట్టుకు వెళ్లారు.

అన్నప్రసాద వితరణ

మండలంలో ఎక్కడైనా హనుమాన్ మాలధారుల దీక్షలు ముగిసే వరకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు మండలంలోని శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన ఫార్మర్ ప్రొడక్షన్ ఆర్గనైజేషన్ ఫౌండర్, దాత మాలోత్ రాజు–స్రవంతి దంపతులు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద హనుమాన్ మాలధారులకు బుధవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

బచ్చన్నపేట నుంచి..

బచ్చన్నపేట: మండల కేంద్రం నుంచి పలువురు హనుమాన్ మాలధారులు యాదాద్రి, కొండగట్టు, వేములవాడ పలు ఆలయాలకు వెళ్లేందుకు పాదయాత్రగా బయలుదేరారు. బుధవారం మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ విగ్రహం వద్ద పూజలు చేసి కొడవటూర్‌లోని సిద్దేశ్వరాలయానికి వెళ్లారు. అక్కడి నుంచి పలు ఆలయాలకు వెళ్లి పాదయాత్రగా కొండగట్టుకు చేరుకొని అక్కడ మాల విమరణ చేస్తామని తెలిపారు.

నిందితుడి అరెస్టు

పాలకుర్తి : నర్సింగపురం తండాకు చెందిన గుగులోత్ స్వాతి మృతికి కుట్ర పన్నిన యాకూబ్‌ను బుధవారం అరెస్టు చేశామని సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. స్వాతి తన ఇంటి పక్కనే ఉన్న మరో ఇంటి రేకులపై దుస్తులు ఆరవేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందిన ఘటన విదితమే. కాగా స్వాతి ఇంటి పక్కన ఉన్న భూక్యా యాకూబ్ ఇంటిపై దుస్తులు ఆరవేసిందన్నారు. అయితే వీరికి పలుమార్లు గొడవలు జరిగినట్లు తమ విచారణలో తేలిందని వెల్లడించారు. స్వాతిని చంపేందుకు యాకూబ్ కుట్ర చేశాడని, ఉద్దేశపూర్వకంగా రేకులపై విద్యుత్ సప్లైను ఏర్పాటు చేశాడని అన్నారు. గర్భవతి అయి న స్వాతి మృతికి యాకూబ్‌గా కుట్ర పన్నినట్లు నిర్ధారించి అరెస్టు చేశామని ఎస్సై లింగారెడ్డి తెలిపారు. మృతురాలి భర్త రాకేష్ ఫిర్యాదు కేసు నమోదు చేశామని పోలీసులు పేర్కొన్నారు.

బంగారు గొలుసు చోరీ



బంగారు గొలుసు దొంగతనం జరిగిన లింగమ్మ ఇంటిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

పాలకుర్తి టౌన్ : పాలకుర్తికి చెందిన చిట్యాల లింగమ్మ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి ఆమె మెడలోని బంగారు గొలుసు, నల్ల పూసల గొట్టాలు అపహరించారు. ఈ మేరకు బుధవారం పోలీసులు తెలిపిన వివరాలు.. ఒంటరిగా ఉన్న వృద్ధురాలి ఇంటికి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమెతో మాట్లాడుతూ మెడలోని బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లారు. మూడు తులాల బంగారు గొలుసు, తులం నల్లపూసల గొట్టాలు తాడు తెగి పోయాయి. కాగా బంగారు గొలుసు ఎత్తుకెళ్లగా, నల్లపూసల తాడు సగం వరకు తెగి అక్కడే పడిపోయాయి. వృద్ధురాలి మెడను పట్టుకుని దాడి చేయబోయారు. లింగమ్మ అరుపులతో దొంగలు ద్విచక్రవాహనంపై పారిపోయారు. లింగమ్మ ఫిర్యాదు మేరకు సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై లింగారెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కె. మల్లేష్ (S.R) : 9849921793 (పాలకుర్తి)
యం.డి. ఖలీల్ (S.R) : 8179719313 (జనగామ)
జి. రవియాదవ్ (A.C.O) : 9032782191